క్లుప్తంగా

ఘనంగా బోనాల వేడుకలు



హుస్నాబాద్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

హుస్నాబాద్: జాంబవంతుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢ మాస బోనాల ఉత్సవం హుస్నాబాద్‌లో నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ, ఎల్లమ్మ దేవాలయాలకు వెళ్లి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురియాలని, పంటలు బాగా పండాలని అమ్మవార్లకు పూజలు చేసి మొక్కుకున్నారు.

కల్లేపెల్లిలో..

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి, మండలంలోని కల్లేపెల్లి గ్రామంలో బుధవారం పోచమ్మ బోనాల ఉత్సవం నిర్వహించారు. బెజ్జంకి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ, ఎల్లమ్మకు, కల్లేపల్లిలో కురుమ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మకు బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించారు.

పాడి పశువుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి



పశుపోషణపై శిక్షణ ఇస్తున్న ఏడీ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కింద స్వశక్తి మహిళలకు అందజేస్తున్న పాడి పశువుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో పాడి పరిశ్రమ యూనిట్లకు ఎంపిక చేసిన మహిళలకు శిక్షణ ఇచ్చారు. పాడి పశువులను ఇతర రాష్ట్రాలకు వెళ్లి కొనుగోలు చేయాలని, మేలు రకం ఎంపిక చేసుకుంటే ఎక్కువ పాలు ఇస్తాయన్నారు.

వరల్డ్ పెయింటింగ్ డే

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో బుధవారం వరల్డ్ పెయింటింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాలరీలో చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చిత్రకారులు రుస్తుం, నహీం రుస్తుం, జులేఖ రుస్తుం, రుబీనా, మహ్మద్ సాధిక్, మహమ్మద్ రహీం పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తొలగించాలి

కోహెడ (హుస్నాబాద్): కోహెడ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న పులువురి ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లను తొలగించాలని బీజేపీ మండల నాయకులు కోహెడ విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఏఈ రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు. బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ 11 కేవీ విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వర్షాలు కురిసినప్పుడు విద్యుత్ సరఫరాతో ఎర్త్ అవుతుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెంలో సర్వే నంబర్ 321లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు గ్రామస్తులు బుధవారం సిద్దిపేటలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకున్నా, అధికారులే వారిని ప్రోత్రహించారని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

సబితను విమర్శించడం తగదు

బెజ్జంకి(సిద్దిపేట): మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని అసెంబ్లీలో సీఎం విమర్శించడం తగదని బెజ్జంకి మాజీ ఎంపీపీ లింగాల నిర్మల బుధవారం అన్నారు. సబితను నమ్మొద్దని మాజీ మంత్రి కేటీఆర్‌కు సీఎం సూచించడం విచారకరమన్నారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిద్దిపేటకు తిరుగు పయనం



సిద్దిపేటకు బయలుదేరిన సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అమర్నాథ్‌లో భక్తులకు అన్న ప్రసాదం ఉచితంగా పంపిణీ చేసిన సిద్దిపేటకు చెందిన అమర్నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు బుధవారం సిద్దిపేటకు తిరుగు ప్రయాణమైనట్లు సభ్యులు తెలిపారు. 34 రోజులు అమర్నాథ్‌లో భక్తులకు సేవలందించినట్లు పేర్కొన్నారు.

జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి

కోహెడ(హుస్నాబాద్): ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మాట నిలుపు కోవాలని కోహెడ ఫ్యాక్స్ ఛైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు అన్నారు. బుధవారం కోహెడలో విలేకరులతో మాట్లాడారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ భర్తీ చేసింది తప్ప కొత్తగా చేసిందేమీలేదన్నారు. డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని మండిపడ్డారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

అరకొర వసతులతో అవస్థలు

- అసంపూర్తిగా సొంత భవన నిర్మాణాలు
- పట్టించుకోని అధికారులు
- చర్యలు చేపట్టాలని డిమాండ్

చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించేందుకు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే వీటి నిర్వహణ అధ్వానంగా ఉంది. శిథిలమైన, రక్షణలేని భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్ని కేంద్రాలు సొంత భవనాల్లో, మరి కొన్ని అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కేంద్రాలను సొంత భవనాల్లో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



కేశవాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం

అక్కన్నపేట(హుస్నాబాద్)

జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో 122 ఉన్నాయి. ఇందులో 44 కేంద్రాలకు సొంత భవనాలు, 29 అద్దె భవనాల్లో, మిగిలిన 49 స్కూల్స్, కమ్యూనిటీ హాల్స్‌లో కొనసాగుతున్నాయి. అలాగే హుస్నాబాద్ మండలంలోని మడద, పందిల్ల, అక్కన్నపేట మండలంలో మసిరెడ్డితండా గ్రామాల్లో చేపట్టిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు ఎన్నో ఏళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

కేంద్రాల్లో సౌకర్యాలు కరువు

సౌకర్యాల లేమితో అంగన్‌వాడీలు నిర్వహిస్తుండటంతో గర్భిణులు, చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీసం గాలి, వెలుతురు లేని గదుల్లోనే కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం ఒక్కో కేంద్రానికి రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు అద్దె చెల్లిస్తోంది. అయితే మండలంలోని కేశవాపూర్ గ్రామంలో ఓ పాత ఇంటిని అద్దెకు తీసుకొని అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు.

మరుగుదొడ్డి సౌకర్యం లేదు

అంగన్‌వాడీ కేంద్రాల్లో కనీసం మరుగుదొడ్డి సౌకర్యం లేదు. అత్యవసరంగా కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాలింతలు, గర్భిణులు ఇళ్లకు వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పుకోలేకపోతున్నారు. చిన్నారులను ఆరుబయటకు తీసుకెళ్తున్నారు. ఈ విషయంపై మండల సర్వసభ్య సమావేశాల్లో ప్రజాప్రతినిధులు పలుమార్లు ప్రస్తావించినా ప్రయోజనం లేకుండా పోయింది.

నూతన భవనం మంజూరు చేయాలి



గ్రామంలో 1984 నుంచి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. అప్పటి నుంచి అరకొర వసతుల మధ్య అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పాత ఇల్లు శిథిలావస్థలో ఉంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక గదిని కేటాయించి అందులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

- ముత్తినేని వేణుగోపాల్‌రావు, కేశవాపూర్

ప్రతిపాదనలు పంపించాం



అంగన్‌వాడీ కేంద్రాల భవనాల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఉమ్మడి హుస్నాబాద్ మండలంలోని మూడు గ్రామాల్లో నిర్మాణ దశలోనే ఉన్నాయి. కొన్ని తండాల్లో కేంద్రాల ఏర్పాటుకు అద్దె భవనాలు తీసుకుందామంటే దొరకడం లేదు.

- జయమ్మ, ఐసీడీఎస్ సీడీపీఓ, హుస్నాబాద్

త్వరలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి

దుబ్బాక: త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను ప్రభుత్వం భర్తీ చేస్తుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపాల్టీ పరిధిలోని ధర్మాజీపేట జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు గందె శ్రీనివాస్ పదవీ విరమణ పొందాడు. ఈ సందర్భంగా నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. త్వరలో 317 జీఓ బాధితుల సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ అమలయ్యేలా కృషి చేస్తున్నానన్నారు. ఖాళీ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం గందె శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాసు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సాదత్‌అలీ, పీఆర్టీయూ దుబ్బాక మండల బాధ్యులు పల్లె శ్రీనివాస్‌గౌడ్, ఆకుల లక్ష్మణ్, సక్క సత్యం, శంకర్ నాయక్, అంజయ్యగౌడ్, గెజిటెడ్ హెచ్ఎంలు నాగభూషణం, పెంటయ్య, జానకి రాములు, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రమేష్, ఉపాధ్యాయులు వెంకట కృష్ణమాచారి, కృష్ణమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్, బాలకృష్ణ, నరేష్, పద్మావతి, అశోక్, చంద్రశేఖర్, రాజేందర్, రేణుక, సీఆర్పీ తాళ్ల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి

ఉద్యమ కళాకారులకు ఉద్యోగాలు ఇవ్వాలి

హుస్నాబాద్: ఉద్యమ నిరుద్యోగ కళాకారుల సమావేశం బుధవారం హుస్నాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు మాట్లాడారు. మలి విడత తెలంగాణ ఉద్యమంలో ఆటపాటలతో ప్రజలను చైతన్యపరిచామన్నారు. గత ప్రభుత్వం 550 మందిని మాత్రమే కళాకారులను గుర్తించి సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. కళనే నమ్ముకున్న తమకు కన్నీళ్లే మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లుగా కూలి పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులను గుర్తించి సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో కళాకారులు కొడముంజ రవీందర్, తాడూరి సురేశ్, కనకం వెంకట్, గడిపె చిన్న, శ్రీకాంత్, సుమన్, అశోక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కళాకారులు

దరఖాస్తుల ఆహ్వానం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అనిత బుధవారం తెలిపారు. ఎంపీసీలో 35, బైపీసీలో 23, 5వ తరగతిలో 36, 6వ తరగతిలో 9, 7వ తరగతిలో 5 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 2వ తేదీన హుస్నాబాద్‌లోని వివేకానంద డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలకు హాజరు కావాలన్నారు. ఆధార్, మార్కుల మెమో, కుల, ఆదాయం, టీసీ, ఆరు ఫొటో 2 జిరాక్స్ సెట్‌తో రావాలన్నారు. మరిన్ని వివరాలకు 8919949523 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

రోగులకు సదుపాయాలు కల్పించాలి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సదుపాయాలు కల్పించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. మున్సిపాలిటీ, ప్రభుత్వ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సఫాయి అప్నే బీమారి భగావో కార్యక్రమం నిర్వహించారు. రోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోగులకు ఇబ్బంది కలుగకుండా వైద్యసేవలు అందించాలన్నారు. ప్రజలు పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ కొంకట నళినీదేవి, డాక్టర్లు రమేష్, జయంత్, సంజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రజిత

అవకతవకలు జరగలేదు

ఆలయ ఈఓ బాలాజీ

సాక్షి ఎఫెక్ట్

కొమురవెల్లి(సిద్దిపేట): గత వేసవిలో కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కూలర్ల కొనుగోలులో అవకతవకలు జరగలేదని ఆలయ ఈఓ బాలాజీ బుధవారం తెలిపారు. మంగళవారం గ్రామానికి చెందిన కొంతమంది యువకులు కూలర్ల కొనుగోలు విషయంలో అవకతవకలు జరిగాయంటూ వినతి పత్రం అందించిన నేపథ్యంలో విచారణ చేపట్టగా ఆలయంలో కొనుగోలు చేసిన కూలర్ల ధరను ఆన్‌లైన్‌లో చూడగా రూ.12,700 ఉందని, దుకాణదారుడు రూ.12,800 ఆలయానికి విక్రయించాడని తెలిపారు. కొంత మంది యువకులు ఉద్దేశపూర్వకంగా ఆలయ ప్రతిష్టను దెబ్బతీసేవిధంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వారిపై అవసరమైతే చట్టపరమై చర్యలు తీసుకుంటామన్నారు.

కాంగ్రెస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేష్ గౌడ్

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బీజేపీయే ప్రత్యామ్నాయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబడి బాలేష్ గౌడ్ అన్నారు. మిరుదొడ్డిలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్కుల దేవరాజు అధ్యక్షతన బుధవారం మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ఎనిమిది ఎంపీ స్థానాలను కైవసం చేసుకుందని, ఇదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలన్నారు. స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాలను గెలుపొందడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాన్గంటి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు రోశయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలేష్ గౌడ్

అంకితభావం కలిగిన అధికారిగా గుర్తింపు

కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి

సిద్దిపేటరూరల్: అంకితభావంతో విధులు నిర్వహించే అధికారిగా జిల్లా బీసీ అభివృద్ధి అధికారి పి.సరోజ గుర్తింపు పొందారని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. బుధవారం ఆమె పదవీ విరమణ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజ, ప్రభాకర్ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేసే అధికారులు అరుదుగా ఉంటారన్నారు. పదవీ విరమణ ఉద్యోగ జీవితంలో సహజమన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీనివాస్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, డీపీఓ దేవకీదేవి, డీఎస్సీడీఓ కవిత, సెట్విన్ అధికారి అమీనా, జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, జిల్లా సంక్షేమ అధికారి శారద, డీఎస్ఓ తనూజ, కలెక్టరేట్ ఏఓ రెహమాన్, డీపీఆర్ఓ రవికుమార్, డీఎం సివిల్ సప్లయ్ అధికారి హరీష్ పాల్గొన్నారు.



సరోజ దంపతులకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్

ఇసుక డంప్‌లు సీజ్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో అక్రమ ఇసుక డంప్‌లను మంగళవారం రాత్రి సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా షణ్ముఖ మిల్లు వద్ద 40 ట్రాక్టర్ల ఇసుకను డంపు చేశారన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టగా అక్రమ ఇసుకను గుర్తించామన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మట్టి రవాణా చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుకను నిల్వ చేసినందుకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

గూడెం శివారులో..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గూడెం శివారులో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 40 టన్నుల ఇసుక డంప్‌ను బుధవారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేశారు. బెజ్జంకి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరపనున్నట్లు తెలిపారు. గంజాయి, డగ్స్, మత్తుపదార్థాలు, ఇసుక, బియ్యం అక్రమ రవాణాపై సమాచారం పోలీసులకు తెలపాలన్నారు.

హరిత దుబ్బాకే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్

దుబ్బాకటౌన్: హరిత దుబ్బాకే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ కల్యాణం రమేశ్ కుమార్ అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్ వద్ద బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన మహోత్సవంలో ఈ ఏడాది దుబ్బాక మున్సిపల్ పరిధిలో 33 వేల మొక్కలను నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొక్కల సంరక్షణ ప్రతీ ఒక్కరీ బాధ్యత అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది ప్రవీణ్ పాల్గొన్నారు.



దుబ్బాకలో మొక్కలను నాటిస్తున్న రమేశ్ కుమార్

తల్లిపాలే సంపూర్ణ ఆహారం

గజ్వేల్ సీడీపీఓ సరిత

వర్గల్(గజ్వేల్): బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాలని గజ్వేల్ సీడీపీఓ సరిత అన్నారు. బుధవారం వర్గల్ మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు అవసరమైన పోషకాలన్నీ తల్లిపాలలో లభిస్తాయన్నారు. మొదటి ఆరునెలలు తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారమని, అలాగే రోగనిరోధక శక్తి పెంపొందుతుందని వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, హెల్త్‌సూపర్‌వైజర్ కమల, హెచ్ఎం మధుసూదన్, ఏఎన్ఎం తిరుపతమ్మ, అంగన్‌వాడీ టీచర్లు వినోద, స్వర్ణ, దుర్గ, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



వర్గల్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ సరిత

సంక్షిప్త వార్తలు

◆ కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన కార్మికుడు గంగాధరి కనకయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం భవన నిర్మాణ సంఘం మండల నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు చెరుకు నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు భవన నిర్మాణరంగ కార్మికులకు ఎలాంటి ఆర్థిక సాయం అందించకపోవడం శోచనీయమన్నారు. మృతుడి కుటుంబానికి సంఘం అండగా ఉంటుందన్నారు.

◆ ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర శర్మ, వనజ ఇటీవల బదిలీపై వెళ్లారు. బుధవారం వారికి పాఠశాలలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి ఘనంగా సన్మానించారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల సౌజన్యంతో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజశ్రీ, ఉపాధ్యాయులు ఉమారాణి, ఆనంద్ రెడ్డి, బాల్‌లింగం, మహిపాల్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, పంతం వెంకట్‌రాజం తదితరులు పాల్గొన్నారు.

◆ ఎల్‌ఓసీ అందజేత

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన కోట రాజు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వం స్పందించి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేసింది. ఈ పత్రాలను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ లబ్ధిదారుడికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు..

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వరికోలు గ్రామానికి చెందిన ఎండీ షాబొద్దీన్‌కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 వేలు చెక్కు చెక్కు రూపంలో మంజూరైంది. ఈ చెక్కును గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు బోయిని జయరాజు లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు శనిగరం తిరుపతి, మడుపు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ సంక్షేమ హాస్టళ్ల పర్యవేక్షణలో విఫలం

సిద్దిపేటఅర్బన్: కాంగ్రెస్ పాలనలో సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోవడంలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మెరుగు మహేష్ ఆరోపించారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి బాలుర సంక్షేమ హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్ సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్స్‌ను పర్యవేక్షించడంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వానికి విద్యాశాఖ మంత్రిని నియమించడంలో శ్రద్ధ చూపడంలేదన్నారు. కార్యక్రమంలో పయ్యావుల శ్యామ్ యాదవ్, సురేష్, ఇషాక్, రాకేష్ పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా, ఒకరికి జైలు శిక్ష విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాలలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 21 మంది పట్టుబడ్డారు. వారిని బుధవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి 21 మందికి రూ.13 వేల జరిమానా, ఒకరికి రెండేళ్ల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

◆ ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు

కోహెడరూరల్(హుస్నాబాద్): ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ సురేందర్ హెచ్చరించారు. మండలంలోని బస్వాపూర్, ఆరేపల్లి గ్రామాల మధ్య సర్వే నంబర్ 75లోగల ప్రభుత్వ భూమిని గతంలో ఐకేపీ, క్రీడా ప్రాంగణానికి కేటాయించారు. ఈ స్థలాన్ని ఆరేపల్లి గ్రామానికి చెందిన జనగాం శంకర్ ట్రాక్టర్‌తో దున్నడంతో గ్రామస్తులు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్ఐ సురేందర్ సంఘటనా స్థలానికి చేరుకొని మోకా పరిశీలన చేశారు. ప్రభుత్వ భూమి అని హద్దులు ఏర్పాటు చేశారు. దీనిపై తహసీల్దార్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

◆ భవిష్యత్తుకు బాటలు వేసేది గురువులే

గజ్వేల్‌రూరల్: విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేది గురువులేనని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి అన్నారు. పట్టణంలోని బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీ ఉమాశశి ఉద్యోగ విరమణ సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఉమాశశి పాటుపడ్డారన్నారు. అనంతరం ఆమెను సన్మానించారు.